పట్టణాభివృద్ధే ప్రధాన లక్ష్యం

- మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ
- మున్సిపల్ సాధారణ, అత్యవసర సమావేశాలు
- పురాతన బ్రిడ్జి, రివర్‌ఫ్రంట్ పార్కు నిర్మాణానికి నిధుల మంజూరు
- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడుకు అభినందనలు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ భూపతి ఆదినారాయణ

నిడదవోలు: పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం ఆయన అధ్యక్షతన మున్సిపల్ సాధారణ, అత్యవసర సమావేశాలు నిర్వహించారు. సాధారణ సమావేశంలో ఆరు అంశాలు, అత్యవసర సమావేశంలో 23 అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ముందుగా మున్సిపల్ చైర్మన్ ఆదివానారాయణ మాట్లాడుతూ పట్టణంలో చినకాశిరేవు వద్ద పశ్చిమడెల్టా ప్రధాన కాలువ (అప్పారావు చానల్)పై బ్రిటీష్ కాలం నాటి పురాతన బ్రిడ్జి నిర్మాణానికి రూ.4.65 కోట్లను మంజూరు చేయించి పట్టణాభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే జి శ్రీనివాస్‌నాయుడుకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత పుష్కరాల సమయంలో టీడీపీ హయాంలో చేపట్టిన వంతెన పనుల్లో నాణ్యత లోపించడంతో రెండేళ్లకే వంతెన కుప్పకూలిపోయిందన్నారు. అప్పటి నుంచి చినకాశిరేవులో కొలువుదీరిన ఆలయాలకు భక్తులు వెళ్లడానికి పడుతున్న ఇబ్బందులు, కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన రోటరీ, మున్సిపల్ కైలాస భూమికి వెళ్లడానికి ప్రజలు పడుతున్న అవస్థలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా ఆయన స్పందించి పురాతన వంతెన నిర్మాణానికి రూ.4.65 కోట్లు మంజూరు చేయించడం అభినందనీయమన్నారు. వంతెన నిర్మాణ పనులు పూర్తయితే భక్తులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభిస్తోందన్నారు. పట్టణ ప్రజలకు చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణ కల్పించే ఉద్దేశంతో పశ్చిమడెల్టా ప్రధాన కాలువ వెంబడి రివర్స్ ఫ్రంట్ పార్కు నిర్మాణం వేగంగా జరుగుతుందన్నారు. పార్కు నిర్మాణానికి మరిన్ని నిధులు అవసరమని కోరగా రాజమహేంద్రవరం రుడా చైర్‌పర్సన్ షర్మిలరెడ్డి రూ.కోటి మంజూరు చేయడంతో కౌన్సిల్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపింది.

కౌన్సిల్ ఆమోదించిన అంశాలు..

పట్టణంలో 15వ ఆర్థిక సంఘం నిధులు, మున్సిపల్ సాధారణ నిధులతో రూ.మూడు కోట్ల వ్యంతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మెడికల్ షాపు నుండి గణపతి సెంటర్ వరకు సీసీ రోడ్డు నిర్మాణం, స్థానిక రైల్వే ఓవర్ బ్రిడ్జి నుంచి గణపతి సెంటర్ వరకు డివైడర్లకు గ్రానైట్ క్లాడింగ్ పనులు, ఎల్ హెచ్ ఎం రోడ్డుకు ఇరువైపులా కల్వర్టులు ఎత్తు పెంచుతూ అప్రోచ్ రోడ్డు వేసేందుకు, ఎల్‌హెచ్‌ఎం రోడ్డుకు ఇరువైపులా డ్రైన్‌పై కవర్ శ్లాబు నిర్మాణాలకు రూ.1.45 కోట్లను మంజూరు చేస్తూ కౌన్సిల్ ఆమోదించింది. 2022–23 సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.53 లక్షలు విడుదల చేయగా అవసరమైన పనులను గుర్తించి నివేదిక ప్రభుత్వానికి పంపించడానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. పురపాలక సంఘంలో ఔట్ సోర్సింగ్ పద్ధతుల్లో విధులు నిర్వహించే కార్మికులకు సహజ మరణానికి రెండు లక్షలు భీమా ఇవ్వాలని ఇచ్చిన ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న ఐదుగురు కుటుంబ సభ్యులకు భీమా చెల్లింపుపై కౌన్సిల్ ఆమోదించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, టౌన్ ప్లానింగ్ అధికారి కె.సుప్రియ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు లక్ష గాజుల పూజ



అమ్మవారికి లక్ష గాజుల అలంకరణ

తాళ్లపూడి: గ్రామంలోని నవదుర్గాది పరివార సహిత కనకదుర్గమ్మ ఆలయంలో గురువారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా లక్ష గాజులతో పూజలు నిర్వహించారు. అమ్మవారికి గాజులనే అలంకరించి కుంకుమార్చనలు చేశారురు. అర్చకులు అల్లూరి శివప్రసాద్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో మహిళలు, నీలి సూర్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోస్టల్ ఉద్యోగికి సత్కారం



సత్యవతిని సత్కరిస్తున్న సిబ్బంది

తాళ్లపూడి: వేగేశ్వరపురం పోస్టాఫీస్‌లో పని చేసి పదవీ విరమణ పొందిన కాళ్ల అనంతలక్ష్మీ సత్యవతికు గురువారం సిబ్బంది ఘనంగా సత్కరించారు. పూలమాల, శాలువ కప్పి ఆమె సేవలను కొనియాడారు.అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టు ఆఫీస్ శ్రీనివాసరావు, సబ్ పోస్టు మాస్టర్ ఏడుకొండలు, సిబ్బంది పద్మ, బాలు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురు పౌర్ణమి

పెరవలి: గురుపూర్ణమి సందర్భంగా తీపర్రులోని సాయిబాబా ఆలయం వద్ద గురువారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున భక్తులు ఆలయానికి వచ్చి బాబాకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఉచిత అన్న సమారాధన నిర్వహించారు. ఈ అన్న సమారాధనకు తీపర్రు, తాటిపర్రు, ఉసులుమర్రు, కాకరపర్రు గ్రామాల నుంచి సుమారు 5 వేల మంది భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

సరస్వతీదేవికి చండీ హోమం

కొవ్వూరు: పట్టణంలో గోష్పాదక్షేత్రంలోని సరస్వతి ఆలయంలో ఆత్మీయ హితకారిణి సమాజం ఆధ్వర్యంలో గురువారం చండీ హోమం నిర్వహించారు. స్థానిక భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. వైవీఎస్ కామేశ్వరరావు, కప్పగంతుల పద్మావతీదేవి వచ్చిన భక్తులకు భోజన వసతి సమకూర్చారు. వాజ్‌పేయ్, నళిని దంపతులతో పాటు సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

పెరవలి: కానూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఏడీఈ బి.వీరభద్రరావు తెలిపారు. కానూరు సబ్‌స్టేషన్ పరిధిలో కానూరు, నడుపల్లి, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ లైన్ మత్తుతులు, విద్యుత్ స్తంభాలు మార్చుటకు సరఫరాను నిలుపుదల చేస్తున్నామని వినియోగదారులు సహకారించాలని ఆయన కోరారు.

రీసర్వే పనుల ప్రారంభం



భూముల రీ సర్వే పనులు చేపట్టిన దృశ్యం

తాళ్లపూడి: జగనన్న శాశ్వత భూ హక్కు, భరక్ష పథకంలో భాగంగా పెద్దేవంలో గురువారం రీ సర్వే పనులు ప్రారంభించారు. సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణలు డ్రోన్ ద్వారా సర్వే ప్రారంభించారు. మండల రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో రీ సర్వే పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వై అలేఖ్య సువర్చల, వీఆర్వో సుజాత, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

చాగల్లు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై ధరల భారాలు మోపుతున్నాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుందరబాబు విమర్శించారు. నిత్యావసర సరకుల ధరలు తగ్గించాలని కోరుతూ చాగల్లులో సీపీఎం మండల శాఖ ఆధ్వర్యంలో ప్రజల వద్దకు వెళ్లి సంతకాల సేకరణ, కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. యువతకు ఉద్యోగాలు లేకపోవడంతో నిరుద్యోగ సమస్య పెరిగిందన్నారు. సీపీఎం మండల కార్యదర్శి కేకే దుర్గారావు, నాయకులు కంకటాల బుద్ధుడు, గారపాటి వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



తాళ్లపూడిలో వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత అధ్యక్షుడు తదితరులు

తాళ్లపూడి: మండల మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రెండు కిడ్నీలు పాడై డయాలసిస్ చేయించుకుంటున్న తాళ్లపూడికి చెందిన కండెల్లి రత్నకుమారికి గురువారం వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందజేసారు. మానవత అధ్యక్షుడు సాయన సుబ్బారావు చేతులు మీదుగా రూ.5 వేలు అందజేశారు. తిగిరిపల్లి దోశాలు, గోకవరపు బాబులు, అప్పన చంద్రగుప్త, సనపల రాజశేఖర్, అంకెం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన నిరసన

కొవ్వూరు: రిజిస్ట్రేషన్ శాఖలో అమలు చేస్తున్న కార్డ్ ప్రైమ్ 2.0 విధానాన్ని ఉపసంహరించాలని దస్తావేజు లేఖరులు చేపట్టిన నిరసన రెండోరోజు కొనసాగింది. గురువారం కొవ్వూరు దస్తావేజు లేఖర్ల సంఘం ఆధ్వర్యంలో స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ముప్పిడి నాగేశ్వరరావు, పాలేటి రవికిషోర్,పట్టపగలు వెంకటరమణ, నాళం సతీష్,వడ్డాది రాజబాబు, ఉక్కు జూరి మురళీ, ప్రసాద్, మోహన్, చౌటుపల్లి బాలు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతే జగన్ ధ్యేయం



13 వార్డులో అనారోగ్యంతో ఉన్న చిన్నారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న హోమ్ మంత్రి వనిత

- హోమ్ మంత్రి తానేటి వనిత
- 13వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం

కొవ్వూరు: అన్నీ వర్గాలకు అభ్యున్నతే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. పట్టణంలో 13వ వార్డులో గురువారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి గడచిన నాలుగేళ్ల పాలనలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని గురించి వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక వార్డు ఇన్‌చార్జి ఏలూరి వెంకట్, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివ రామకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు మన్నె పద్మ,గంధ్రోతు అంజనీదేవి, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, పట్టణ పార్టీ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సలాది సందీప్‌కుమార్, నాయకులు పోసిన శ్రీకృష్ణ దేవరాయులు, లకంసాని సూర్యప్రకాశరావు, చాగల్లు మండల పార్టీ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, చిట్టూరి అన్నవరం, తోట రామ కృష్ణ, వరిగేటి సుధాకర్, సిద్దన వాసు, ఇంటి వీర్రాజు, స్థానిక కౌన్సిలర్లు తోట లక్ష్మీప్రసన్న, దేవగుప్తాపు చాందిని, మద్దిపట్ల సాయి గీత, చీరా అరుణకుమారి, వరిగేటి లలిత కుమారి, అంకోలు వెంకట లీల్లి పద్మలీల తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- పెండ్యాలలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన



పెండ్యాల గ్రామంలో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. పెండ్యాల గ్రామంలో గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కారింకి అన్నవరం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను, గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో పెండ్యాల గ్రామంలో ప్రధాన రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం చేపట్టామన్నారు. గతంలో టీడీపీ నాయకులు కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను మోసగించారే తప్ప, ఏనాడైనా ప్రజల సంక్షేమం పట్టించుకున్నారా అని ప్రశ్నించారు. గోదావరిలో ఇసుకను టీడీపీ నాయకులు దోచేసి రూ.కోట్లు సంపాదించారని విమర్శించారు. గ్రామ ప్రజలు సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి ఎమ్మెల్యే తక్షణ చర్యలు చేపట్టారు. ప్రభుత్వ గృహరుణంతో నూతనంగా నిర్మించిన చలపాటి శ్రీను గృహాన్ని ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, గ్రామ అధ్యక్షుడు ఉప్పులూరి రామకృష్ణాంజనేయులు, జేసీఎస్ కన్వీనర్ వెలగన పోలయ్య, పార్టీ రాష్ట్ర నాయకులు ముళ్లపూడి శ్రీనివాస్‌కుమార్ చౌదరి, యాళ్ల రామారావు, స్థానిక నాయకులు నాయుడు సత్యనారాయణ, పేరిచర్ల నాగరాజు, వాకా సూర్యనారాయణ, సరిపల్లి నూకరాజు, మేడిమూడి సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పవిత్రారోహణ

నేటితో ముగియనున్న శ్రీవారి దివ్య పవిత్రోత్సవాలు



దివ్య పవిత్రాలతో ప్రదక్షిణలు చేస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: చినవెంకన్న ఆలయంలో జరుగుతున్న శ్రీవారి దివ్య పవిత్రోత్సవాల్లో భాగంగా గురువారం పవిత్రారోహణ వేడుక వైభవంగా జరిగింది. గత రెండు రోజులుగా ఆలయంలో ఈ ఉత్సవాలను పురస్కరించుకుని విశేష కార్యక్రమాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా ఉదయం ఆలయ యాగశాలలో హోమం ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అలంకరణలు చేసే పవిత్రాలను అర్చకులు శిరస్సుపై ఉంచుకుని మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయంలో ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది, పలువురు భక్తులు స్వామివారి వాహనాన్ని భక్తి ప్రపత్తులతో మోశారు. ఆ తరువాత ఆలయ గర్భాలయంలో కొలువైన శ్రీవారి మూలవిరాట్‌కు, అమ్మవార్లకు అలాగే ఉత్సవమూర్తులకు అర్చకులు పవిత్రాలను ధరింపజేశారు. అనంతరం పవిత్రాంగ హోమం, శాంతి హోమాన్ని భక్తుల గోవింద నామస్మరణల నడుమ అట్టహాసంగా నిర్వహించారు.

గుత్తులకు ఎంపీ పరామర్శ

రాజమహేంద్రవరం సిటీ: మాతృ వియోగంతో బాధపడుతున్న 50వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, రాష్ట్ర అదనపు కార్యదర్శి గుత్తుల మురళీధరరావును ఎంపీ మార్గాని భరత్‌రామ్ పరామర్శించారు. గురువారం మురళీధరరావు మాతృమూర్తి గుత్తుల సూరమ్మ (82) తుదిశ్వాస విడిచారు. ఈ మేరకు ఎంపీ తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితరులు ఉన్నారు.

అనుబంధాలకు ప్రతీక రక్షాబంధన్

నిడదవోలు: అనుబంధాలకు, మమతానురాగాలకు నెలవు రక్షాబంధన్ పండగ అని ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు అన్నారు. పట్టణంలో తన క్యాంపు కార్యాలయంలో గురువారం రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ చిలకల శారదాదేవితో పాటు పలువురు ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడికి రాఖీ కట్టి ఆశీస్సులు పొందారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనంగా ఆత్మీయంగా ఆచరించే రాఖీ పౌర్ణమిని జరుపుకోవడం చాలా ఆనందాన్ని ఇస్తుందన్నారు.

నిడదవోలు రూరల్: మండలంలోని పెండ్యాల గ్రామంలో గురువారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వచ్చిన ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడికి వలంటీర్ పసుపులేటి నాగసునీత, సర్పంచ్ కారింకి అన్నవరం భార్య అనంతలక్ష్మి, గ్రామంలోని పలువురి మహిళలు రాఖీలు కట్టి స్వీట్స్ తినిపించి ఆశీర్వాదం తీసుకున్నారు.



ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడుకి రాఖీ కడుతున్న కౌన్సిలర్ చిలకల శారదాదేవి

గోపాలపురం: రాఖీ పండుగ సందర్భంగా గురువారం గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావుకు వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన సోదరి దేవరపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్ల లక్ష్మి, శాప్ డైరెక్టర్ కప్పల వరలక్ష్మి, మండల మహిళా అధ్యక్షురాలు నాగమణి, మేరీ తదితరులు రాఖీ కట్టినవారిలో ఉన్నారు.



దేవరపల్లిలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావుకు రాఖీ కడుతున్న వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు

నల్లజర్ల: అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండగ. ఇళ్లలో ఆడపిల్లలు తమ సోదరులకు రాఖీ కట్టి స్వీట్లు తినిపించి సందడి చేశారు. వివిధ ఉన్నత పాఠశాలల్లో, ప్రాథమిక పాఠశాలల్లో చిన్నారులు తమకు సోదర సమానులైన తోటి విద్యార్థులకు రాఖీలు కట్టి తమ అనుబంధాన్ని చాటి చెప్పారు. దూరప్రాంతాలలో ఉన్న సోదరులు సైతం స్వగ్రామాలకు వచ్చి సోదరులతో రాఖీలు కట్టించుకున్నారు.

పశువుల దాణా అందజేత



మోర్తలో గోసంరక్షణకు తరలిస్తున్న పశువుల మేత

ఉండ్రాజవరం: గోవులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మోర్త సత్యసాయి సేవా సమితి సభ్యులు అన్నారు. మోర్త శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ద్వారకా తిరుమలలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో గోశాలలోని గోవులకు మేత(పచ్చగడ్డి)ని అందజేశారు. వారు మాట్లాడుతూ మోర్తలో సేకరించిన పశువుల మేతను ట్రాక్టర్ ద్వారా చిన్న తిరుమలకు తరలించినట్టు తెలిపారు. చామర్తి సత్యనారాయణ, ఈఎస్ సత్యనారాయణ, ఎంవీఎస్ ప్రకాశరావు, జిల్లా అధ్యక్షులు కె.రవీంద్రప్రసాద్ పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

గోపాలపురం: రైతు భరోసా కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి బి.రాజారావు అన్నారు. గుడ్డిగూడెంలో గురువారం పొలంబడి కార్యక్రమం సర్పంచ్ చిలకా మడిచర్ల ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏఓ రాజారావు మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్బీకేల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. సిబ్బంది సలహాలను తీసుకోవాలని సూచించారు. ప్రతి రైతు ఈ–పంట నమోదు చేయాలని తద్వారా ఏయే పంటలు వేశారన్నది ప్రభుత్వానికి అంచనా ఉంటుందన్నారు. ఆరు తడిపంటలు వేసే రైతులు పచ్చిరొట్టి ఎరువులను తప్పనిసరిగా వేయాలన్నారు. ఏఎంసీ ఉపాధ్యక్షుడు తోట నాగేశ్వరరావు, దూళిపాల ప్రభాకర్ వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

జిల్లా మలేరియా అధికారి వీర్రాజు



నల్లజర్ల కోనేరు కాలనీలో ప్రాంతాలను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి వీర్రాజు

నల్లజర్ల: ప్రజారోగ్య పరిరక్షణకు వైద్య ఉద్యోగులు క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజలను వ్యాధుల బారి నుంచి రక్షించాలని తూర్పుగోదావరి జిల్లా మలేరియా అధికారి జి.వీర్రాజు పిలుపునిచ్చారు. గురువారం నల్లజర్లలో పలు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వారంలో ఒక రోజు డ్రైడే పాటించడం ద్వారా మలేరియా, డెంగీ వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చునన్నారు. పలు వ్యాధులకు ప్రధాన కారకాలైన దోమల లార్వాలను ముందుగా నివారించేందుకు సిబ్బంది ముందుండాలన్నారు. ఇళ్ల పరిసరాలలో ఉన్న నీటినిల్వలను ఖాళీ ప్రదేశాలలో ఉండే చెత్త, పనికిరాని వస్తువుల్లో దోమలకు ఆవాసాలుగా ఉంటాయన్నారు. వీటిని ఎప్పటికప్పుడు తీసేస్తూ ఉండాలన్నారు. అనుమానిత జ్వరం కేసులకు ప్రాథమిక పరీక్షలు అన్ని వెల్‌నెస్ సెంటర్లలో ఉచితంగా చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు, పీహెచ్‌సీ డాక్టరు తెల్లం గంగాధరరావు, డాక్టరు మహమ్మద్ సిరాజుద్దీన్, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లపై చేరిన మురుగు



చీపురుగూడెంలో రహదారిపైకి వస్తున్న మురుగునీరు

నల్లజర్ల: చీపురుగూడెంలో రహదారులపై మురుగునీరు ప్రవహించడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇది గత పాలకుల తప్పిదమని ఆ గ్రామ సర్పంచ్ గాలింకి మల్లిక చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామాన వేసిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల్లో ఎటువంటి సాంకేతిక పురోగతి లేకపోవడంతో మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. 9 అంగుళాల పైపుతో ఏర్పాటు చేసిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి అడుగున ఎటువంటి బెడ్ కాంక్రీట్ వేయకపోవడంతో పలు చోట్ల వేసిన డ్రైనేజీలో పైపులు కిందకు కుంగిపోయి మురుగునీరు రోడ్లపైకి వచ్చి చేరుతోంది. డ్రైనేజీల్లో పూడిక తొలగించినా యథావిధిగా యథావిధిగానే ఉంటుందని సర్పంచ్ వివరించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని తెలిపారు. అధికారులు ప్రజలకు మేలు జరిగే చర్యలు తీసుకోవాలని గ్రామపెద్దలు గాలింకి రాంబాబు, తలంసెట్టి మాధవరావు, చెల్లు హరిబాబు విజ్ఞప్తి చేశారు.

రేపు ఆయుర్వేద వైద్య శిబిరం

నిడదవోలు: స్థానిక రోటరీ ఆడిటరియంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో దాత ఉప్పులూరి వీరభద్రరావు సహకారంతో శనివారం ఉదయం 9 గంటలకు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు తెలిపారు. ఈ శిబిరంలో కీళ్ల నొప్పులు, సయాటికా, స్పాండిలైటిస్, చర్మ వ్యాధులు తదితర వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని ఆయన పేర్కొన్నారు.

శ్రీవారి కాటేజీ డోనార్ స్కీంకు రూ.7 లక్షల విరాళం



విరాళం చెక్కును ఆలయ ఏఈఓ నటరాజారావుకు అందజేస్తున్న దాత అన్నపూర్ణ

ద్వారకాతిరుమల: శ్రీవారి కాటేజీ డోనార్ స్కీంకు ఒక భక్తురాలు గురువారం రూ.7 లక్షలను విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన వి.అన్నపూర్ణ ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళం చెక్కును ఆలయ ఏఈఓ పి.నటరాజారావుకు అందించగా, ఆయన దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందజేశారు.

అనాథ పిల్లల సంరక్షణకు చట్టాలు

కంబాలచెరువు: స్థానిక ప్రకాష్‌నగర్ సమీపంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో అనాథ పిల్లల సంరక్షణ, విద్యా చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి మాట్లాడుతూ అనాథ పిల్లలు, తల్లిదండ్రుల నిర్లక్ష్యం వల్ల బాధింపబడుతున్న పిల్లలు కనిపించినప్పుడు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, పోలీసులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలపాలన్నారు. పిల్లల పట్ల అమానుషంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు.